RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 305 | నవంబర్ 11, 2025 | వెల : రూ.3-00



దేశ రక్షణ స్వావలంబనకు డీపీఎస్‌యూలు శక్తివంతమైన స్తంభాలు : రాజ్‌నాథ్

3లో..




# నన్నపునేని అలా.. కొండా ఇలా..!

- తూర్పులో అభివృద్ధి కోసం పోరాడే నాయకత్వం కరువు
- ప్రజా సమస్యలు పక్కనెట్టి.. రాజకీయానికి పరిమితం
- అభివృద్ధి దిశగా పక్క నియోజకవర్గం.. తూర్పున మాత్రం నిశ్శబ్దం
- గత ప్రజాప్రతినిధులతో పాటు ప్రస్తుతం సేమ్ సీన్.. అందరూ అందరే..
- అసలు 'ఈస్ట్'పై వివక్ష ఎందుకు.. మారాల్సింది నాయకత్వమా? జనమా?

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ఆశలు అడియాసలవుతున్నాయి..! ఎన్నో ఆకాంక్షలతో కలలకు రెక్కలు తొడిగే సమయం ఆసన్నమవుతున్నట్లు అనిపించినా చివరకు నిట్టూర్చే పరిస్థితులు ఎదురవుతున్నాయి.! ఎడారి ఎండమావిలో తొలకరి చినుకులా ఆశలకు రెక్కలు తొడిగే నాయకత్వం అంటూ.. ఊపిరి పోస్తున్నట్లు ప్రగల్బాలు.. తీరా చూస్తే.. తీరం దరి చేరక, అసలేమీ సంబంధం లేని విషయాల రాద్ధాంతాలతో అసలు హోప్ అనేదే కనిపించక.. చివరకు ఆచరణలో అంతా భ్రాంతియేనా? అన్నట్లుగా మారే పరిస్థితులతో వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు తమ సెగ్మెంట్ పరిధిలో డెవలప్‌మెంట్ చేసే నాయకత్వం కరువైందని బరువెక్కిన గుండెలతో బాధపడుతున్నారు.

**– సేమ్ సీన్!**

గత, ప్రస్తుత.. ప్రజాప్రతినిధులెవరైనా సరే.. వరంగల్ తూర్పు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ఎందుకు దృష్టి సారించడం లేదో తెలియడం లేదని జనం తలలు పట్టుకుంటున్నారు. ప్రజాసమస్యలను పూర్తిగా పక్కనపెట్టి రాజకీయాలకే పరిమితమవుతుండటంతో 'తూర్పు' పరిస్థితి 'ఎప్పటి చిప్ప ఎనుగులనే' అన్నట్లుగా మారుతోందని వాపోతున్నారు. పక్క అసెంబ్లీ సెగ్మెంట్లలో అభివృద్ధి ఆనవాళ్లు కండ్ల ముందు స్పష్టంగా కనబడుతూ.. ఆచరణాత్మకంగా కార్యాచరణతో పనులు ముందుకు సాగుతుంటే..ఇక్కడ మాత్రం భిన్న పరిస్థితులు కొనసాగుతుండటం పట్ల పెదవి విరుస్తున్నారు. నిశ్శబ్దమే 'తూర్పు' ఆనవాళ్లు..అన్నట్టుగా మారని పరిస్థితులు కొనసాగుతుండటం పట్ల ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో అభివృద్ధి చేసే నాయకత్వం ఎందుకు కరువు అవుతున్నదో తెలియని సందిగ్ధం అయితే నెలకొందని, పక్క సెగ్మెంట్లలో పరిస్థితులను చూస్తే ఇట్టే అర్థమవుతుందని అంటున్నారు. ఈ సెగ్మెంట్‌పై వివక్ష ధోరణి కొనసాగుతున్నదా? అనే అనుమానం కలగక మానదు. అయితే, ఇక్కడ అభివృద్ధికి నోచని పరిస్థితులపైన ప్రశ్నించే నాయకత్వం మారాలా? లేదా అసలు ప్రజలు మారి ముందుకు సాగాలా? అనే ప్రశ్నలు అయితే ఎదురవుతున్నాయి. మొత్తంగా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిస్థితి అభివృద్ధియే కాదు కనీస విషయాల్లో సైతం అన్నింటా వెనకే అన్నట్లు ఉండటం పట్ల జనం నొచ్చుకుంటున్నారు. మార్పు రావాలని భావిస్తున్నామని కానీ, అది ఎప్పటికి సాధ్యమవుతుందో తెలియడం లేదని అంటున్నారు.


# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో కొత్త శకం ఆరంభమైందని చెప్పేలా, టీమిండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ సోమవారం మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాం బర్‌కి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చేరుకున్న అజారుద్దీన్, ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం 'బిస్మిల్లాహ్'తో అధికారి బాధ్యతల పత్రాలపై సంతకం చేశారు. ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్ర మానికి అధికారులు, పార్టీ నేతలు, సచివాల య సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, "నా మీద ఎంతో నమ్మకం ఉంచి ఈ అత్యంత కీలకమైన రెండు శాఖలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు. సీఎం ఆశించిన విధంగా, నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తాను. తెలంగాణ మైనార్టీల సాధికారత, సంక్షేమానికి, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి కృషి చేస్తాను" అని స్పష్టం చేశారు. తన శాఖల్లో పారదర్శకత, స్పష్టమైన విధానాలు, నూతన ఆవిష్కరణలు, వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. అజారుద్దీన్ బాధ్యతలు స్వీకరించడం పట్ల సచివాలయం సందడిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు వరుసగా ఆయనను అభినందించారు. మైనార్టీల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మహిళలు మరియు యువతకు అవకాశాల కల్పనలో అజారుద్దీన్ ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన సమీప వర్గాలు సూచిస్తున్నాయి. అదే విధంగా, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలో నష్టాల్లో ఉన్న సంస్థలను పునరుద్ధరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజల కోసం మరింత సమర్థవంతంగా నడపడం, ఆదా యాన్ని పెంచే మార్గాలను అన్వేషించడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.



గమనించదగ్గ విషయమేమిటంటే, గత నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయన చేత ప్రమాణం చేయిం చి, నవంబర్ 4న సీఎం రేవంత్ రెడ్డి శాఖలను కేటాయించారు. తెలంగాణ క్రీడా రంగంలో అజారుద్దీన్ ప్రతిష్ట, జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా, ఆయన మంత్రిగా ప్రవేశించడంపై ప్రజల్లో కూడా మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పుడు అధికారికంగా బాధ్యతలు చేపట్టడంతో, రెండు శాఖల్లో త్వరలోనే చర్యలు, మార్పులు, కొత్త విధానాలు అమలవుతాయనే అంచనాలు పెరుగుతున్నాయి. అధికార వర్గాల అభిప్రాయం ప్రకారం, అజారుద్దీన్ జాతీయ ఖ్యాతి, ప్రజలతో అనుసంధానం, పరిపాలనా తీరు మైనార్టీ సంక్షేమ రంగంలో నూతన మార్పులకు దోహదం చేసే అవకాశం ఉంది. సచివాలయంతో పాటు, ప్రజాసమస్యలను తెలుసుకు నేందుకు ఫీల్డ్ విజిట్లు కూడా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.



## తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" రచించిన అందెశ్రీ మరణం, రాష్ట్ర సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల హృదయాలను తాకి, విప్లవ జ్వాలను రగిలించిన జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది మంది గొంతుకగా నిలిచిందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధనలో ప్రజలకు చైతన్యం నింపడంలో అందెశ్రీ కవిత్వం ప్రత్యేక పాత్ర పోషించిందని కొనియాడారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని కూడా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతానికి కొత్త స్వర రూపకల్పనలో ఆయనతో పంచుకున్న ఆలోచనలు, సహకారం తనకు ప్రత్యేకమైన అనుభూతి కలిగించిందని తెలిపారు. "తెలంగాణ సాహితీ శిఖరం కూలిపోయిన భావన కలుగుతోంది. స్వరాష్ట్ర సాధనలో, జాతి చైతన్యంలో అందెశ్రీ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన రేవంత్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# స్పీకర్ పై సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటిషన్

**– ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై గడువు ముగిసినా నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఆరోపణ**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీం కోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మె ల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు విధించిన గడువు ముగిసినా, స్పీకర్ ఎటు వంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను

మిగతా 3వ పేజీలో..

## అందెశ్రీ మరణంపై మంత్రి సీతక్క సంతాపం

**వేద న్యూస్, హైదరాబాద్:**



ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల పంచా యతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజా సాహిత్యానికి, స్వరాష్ట్ర ఉద్యమానికి అందెశ్రీ అందించిన సేవలు అపూర్వమని ఆమె పేర్కొన్నారు. అందెశ్రీ రచనలు, గీతాలు తెలంగాణ ఉద్యమ రోజుల్లో ప్రజల్లో చైతన్యం నింపి, స్వరాష్ట్ర సాధనకు దారితీశాయని మంత్రి గుర్తుచేశారు. "జయ జయహే తెలంగాణ" గీతం ఇవాళ రాష్ట్ర గీతంగా ప్రతి తెలంగాణ బిడ్డ గర్వంతో ఆలపిస్తున్నదని చెప్పారు. తెలంగాణ ఉన్నంత వరకూ అందెశ్రీ అందించిన చైతన్యం సజీవంగానే ఉంటుందని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు ఓటర్లు బుద్ధి చెబుతారు

**– మాజీ మంత్రి హరీశ్‌రావు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ప్రలోభాల రాజకీయాలకు పాల్పడుతూ, భారీ స్థాయిలో అవకతవకలు జరుపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్
మంగళవారం నవంబర్ 11, 2025

# 'మన చద్దన్నం'కు మస్తు గిరాకీ

- ప్రారంభమైన 2 గంటల్లోనే ఫుడ్ ఖతం..
- కాంగ్రెస్ సీనియర్ నేత సోమన్న చేతుల మీదుగా ఫుడ్ స్టాల్ ప్రారంభం



**వేద న్యూస్, తొర్రూరు:**

"మన చద్దన్నం"కు మస్తు గిరాకీ వచ్చిందండోయ్.. ప్రారంభమైన రెండు గంటల్లోనే ఫుడ్ మొత్తం అయిపోయింది. ఆయిల్, మసాలా లేకుండా..తాజా, సహజ సిద్ధమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా సోమవారం ప్రారంభమైన 'మన చద్దన్నం' ఫుడ్ స్టాల్ కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రజలకు చక్కటి ఆహారాన్ని అందించి.. వ్యాపార పరంగానూ నిర్వాహకులు రాణించాలని సోమన్న ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు పాశం రాజు దంపతులు కాంగ్రెస్ నాయకుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు. మన పెద్దవాళ్లు, తాత ముత్తాతలు "చద్దన్నం" తిని ఎలాంటి అనారోగ్యాలు లేకుండా నూరు, నూటఇరవై ఏండ్లు బతికిన సంగతి మనందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే అటువంటి చక్కటి నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యమని ఫుడ్ స్టాల్ ప్రొప్రైటర్ పాశం రాజు పేర్కొన్నారు.

# ప్రభుత్వ జీతం, ప్రైవేటు పనా?

- ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు..!

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ జీతం తీసుకుంటూ, ప్రైవేటు పనులు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి ద్వంద వైఖరి పై మండల ప్రజలు పలు విధాలుగా చర్చించుకుంటూ, గుసగుసలాడుతున్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి తన విధులను మరిచి ఎంపీడీవో స్వంత కారును నడుపుతున్నాడని మండల ప్రజలు ఆగ్రహం తీవ్ర వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రభుత్వ కార్యాలయ పనులు వదిలి కేవలం ఒక అధికారి వ్యక్తిగత పనులను ఎలా చేస్తారు? అని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. నెల నెల జీతం ప్రభుత్వం ఇస్తే, పని మాత్రం ఎంపీడీవోకు వ్యక్తిగతంగా చేస్తున్నాడని,ప్రభుత్వ జీతం ప్రైవేటు పనా? అని దీనిపై యావత్ మండల ప్రజలు ముక్కు మీద వదిలేసుకుంటున్నారు. అసలు ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రైవేటు పనులు చేయవచ్చా? ఇలా అటెండర్ను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎంపీడీవో హోదాలో ఉండి ఎలా చేయించు కుంటున్నాడు? ఇలా చేయడం చట్టరీత్యా నేరం అని ఆ అధికారికి తెలియదా? అని కూడా ప్రశ్నిస్తున్నారు. గత సంవత్సరం నరనుండి ఇదే తంతు కొనసాగు తుంది. అటెండర్ అంటే ఆఫీస్ పనులు మాత్రమే చేయాలని అటెండర్ కి తెలవదా? ఆయనను వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్న ఆధికారికి తెలియదా ప్రభుత్వ నియమ నిబంధనలపై అవగాహన లేదా? అని కూడా వారు అంటున్నారు. అసలు ఆఫీసులో పనులు ఏ మాత్రం చేస్తే లేరని కూడా సమాచారం. కేవలం ఎంపీడీవో కారు నడుపుతూ మాత్రమే ఇలా నెల నెల ప్రభుత్వం నుండి జీతం తీసుకోవడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం జీతం ఇస్తే ఎంపీడీవో మాత్రం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ, తమ వ్యక్తిగత పనులను చేయించుకుంటారా?




అని మండల ప్రజలు మండిపడుతూ, దీనిపైన పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వము నుండి జీతం తీసు కుంటూ,ఎంపీడీవోకు వ్యక్తిగత పనులు చేస్తున్న ఆ అటెండర్ పై, అదేవిధంగా అటెండర్ను ఆఫీసు పనులకు కాకుండా తమ వ్యక్తిగతంగా ఉపయోగించుకున్న ఎంపీడీవో అధికారిపై కూడా శాఖా పరమైన చర్యలు తీసుకొని ,భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసి ప్రభుత్వ సమయమును, ధనాన్ని కాపాడవలసిందిగా యావత్ మండల ప్రజలు కోరుతున్నారు.

# నార్మల్ డెలివరీకే ప్రాధాన్యత

- ఆడవారి కోసం ప్రత్యేకంగా మోనోపాజ్ క్లినిక్
- 24/7 అందుబాటులో స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ గ్రీష్మ ఒగ్గు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సురక్షిత, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళలకు డాక్టర్ గ్రీష్మ ఒగ్గు, కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిషియన్, గైనకాలజిస్ట్, సర్టిఫైడ్ మోనోపాజ్ ప్రాక్టీషనర్, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ చక్కటి వైద్యం చేస్తున్నారు. 24/7 ఆమె ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారు. ఆడవారికి గర్భం వచ్చిన నాటి నుంచి 9 నెలల వరకు సురక్షిత, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. నార్మల్, సిజేరియన్.. కాన్పులు చేస్తారు. కాగా, నొప్పి లేకుండా నార్మల్ డెలివరీ (ఎపిడ్యూరల్ అనాల్జిసియా)కి ప్రాధాన్యతనిస్తారు. దీని వల్ల నార్మల్ డెలివరీ నొప్పి లేకుండా జరుగును. సాధారణ ప్రసవానికి ప్రయారిటీ ఇస్తూ తల్లీ బిడ్డల క్షేమమే ధ్యేయంగా వైద్య సేవలను అందిస్తున్నారు.

**ప్రత్యేక చికిత్సలూ అందుబాటులో**

ఆడపిల్లలందరికీ 15 ఏండ్ల తర్వాత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ఆదిత్య ఆస్పత్రిలో అందిస్తారు. పెళ్లి అయి చాలా కాలం పిల్లలు లేని వారికి, ప్రెగ్నెన్సీ అంది రిపీటెడ్‌గా అబార్షన్ అవుతున్న వారికి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. ఇక మహిళలు ఎవరికైతే పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం అయ్యే వారికి, కడుపులో నొప్పి వచ్చే వారికి ..ఇలాంటి ఇబ్బందులు ఉన్న వారికి ప్రత్యేక చికిత్సలు ఇస్తున్నారు. రుతుస్రావం ఆగిపోయిన ఆడవారికి జమ్మికుంటలో తొలిసారి మోనోపాజ్ క్లినిక్ ప్రారంభించ బోతున్నట్టుడాక్టర్ గ్రీష్మ తెలిపారు. దీని వల్ల ఎవరైతే హార్ట్ ఫ్లషెస్, యోని పొడి బారిపోవడం, నిద్ర పట్టక పోవడం.. ఇలాంటి ఇబ్బందులు ఉన్న వారికి ప్రత్యేక చికిత్సలు అందించనున్నారు అందరూ ఈ చికిత్సను వినియో గిచుకోవాలని సూచించారు.

# పోలీసు విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు నమోదు

**వేద న్యూస్, రుద్రూర్ :**



విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.సాయన్న తెలిపారు. ఎస్సై పి. సాయన్న తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి విధులలో ఉన్న హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పెట్రోలింగ్ నిర్మహిస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా అక్కడికి తాటి పాముల రాజశేఖర్ (రిపోర్టర్) వచ్చి వారి విధులకు ఆటంకం కలిగిస్తూ మీరు ఎలా తీసుకుపోతారని అడ్డుకొని అంతటితో ఆగకుండా పోలీస్ స్టేషన్ కు వచ్చి వాదించాడు అనే ఫిర్యాదు పై రాజశేఖర్ పై ఎఫ్ ఐ ఆర్ చేయడం జరిగింది అని ఎస్సై పి.సాయన్న ఒక ప్రకటనలో తెలియజేశారు.

# పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య..!

- తంగళ్ళపల్లి మండలంలో కలకలం

**వేద న్యూస్,తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పెట్రోల్ పోసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన మచ్చ జలంధర్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసు కుని నిప్పంటించు కోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మండల కేంద్రానికి చెందిన మచ్చ జలంధర్ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది. పెట్రోల్ పోసుకున్న కారణంగా జలంధర్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు.మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడు మచ్చ జలంధర్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా



తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి కుటుంబ సభ్యులను,స్థానికులను విచారి స్తున్నారు.?ఈ దుర్ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# కాన్షియస్నెస్ క్లబ్ అవగాహన

**వేద న్యూస్, చొప్పదండి:**

మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ రుక్మాపూర్ పాఠశాలలో కాన్షియస్నెస్ క్లబ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్ నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాన్షియస్నెస్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా పలు అంశములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం పై వివరిస్తూ గంజాయి, మత్తుపదార్థాల వినియోగంపై వాటి వల్ల జరిగే నష్టాలపై, సైబర్ క్రైమ్ నేరాలపై బాల్య వివాహాలు, పోక్సో చట్టం తదితర అంశములపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న నేరాలపై వివరిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని చెడు అలవాట్లకు లోను కావద్దని వివరించారు. మంచి విద్యను అభ్యసిస్తూ తల్లి దండ్రులకు, ఉపాధ్యా యులకు, సమాజానికి, గ్రామానికి మంచి పేరు తేవాలని విద్యార్థులను కోరారు. బట్టి చదువులు కాకుండా అవగాహనతో




కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులు కోరారు. అవకాశం ఉంటే పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం సంద ర్శించడానికి అవకాశం కల్పిస్తామని విద్యార్థులకు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు తుమ్మనపల్లి విద్యాసాగర్ రావు, కాన్షియస్నెస్ క్లబ్ ఇన్చార్జి సముద్రాల అంజయ్య, గట్టు శ్రీవాణి, సంగనభట్ల సురేందర్, మాధవరపు శారద, బండపల్లి మల్లికార్జున్, సుంకే ఉమాదేవి, సిఆర్పి సురేందర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే- రాజమార్గం

**వేద న్యూస్, చొప్పదండి :**

ఈ నెల 15 శనివారం నాడు జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆయన మాట్లాడుతూ రాజీపడదగిన కేసుల్లో ఇరువర్గాల మధ్య పరస్పర అవగాహనతో పరిష్కారం కనుక్కోవడం వల్ల సమయం, ధనం, శ్రమ ఆదా అవుతుందని తెలిపారు. రాజీ ద్వారా అందరికీ న్యాయం త్వరగా లభిస్తుందని పేర్కొన్నారు. ఏయే కేసులు రాజీకి అనువో తెలుసు కోండి, ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన విభేదాలు, మోటార్ వాహన నిబంధనల ఉల్లంఘన, డ్రంకన్ డ్రైవ్, విద్యుత్ చౌర్యం, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ వంటి కేసులు రాజీపడదగినవని ఆయన వివరించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేయొద్దు. చిన్న చిన్న తగాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేయకుండా, లోక్ అదాలత్ ద్వారా పరస్పర రాజీ చేసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్సై సూచించారు. పోలీసు సిబ్బంది కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.




- ఎస్సై నరేష్ రెడ్డి

# శ్రీ వీరభద్ర మందిరంలో ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, రుద్రూర్ :**

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ వీరభద్ర స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేపట్టారు.



అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శివ అప్ప, ఆలయ చైర్మన్ మేక వెంకన్న, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వీరే రేపటి సంపద

**వేద న్యూస్, చొప్పదండి రామడుగు:**



విరబూసిన బోసినవ్వులతో బుడి బుడి అడుగులు వేస్తూ కలియ తిరుగుతూ ముచ్చట గొలిపే ఈ బాలలే రేపటి తరం ఈ దేశ వారసులని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు నరేందర్ రెడ్డి అన్నారు. రానున్న నవంబర్ 14 ను పురస్కరించుకుని మండలంలోని గోపాల్ రావు పెట్ అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు బాలల వేడుకలు నిర్వహించారు. అలనాడు దేశం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన దేశ భక్తులకు తీసిపోని విధంగా విద్యార్థులను అనుకరింప చేశారు. ఈ సందర్భంగా హాజరైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో చదువుతో పాటు దేశ భక్తి పెంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం బాధ్యతగా భావించాలన్నారు.

# బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్పించాల్సిందే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పురుడు పోసుకున్న కాకతీయ యూనివర్సిటీ గడ్డ మీద మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్పించి, బీసీలకు సత్వర న్యాయం చేయాలని, మేమెంతో మాకంతా వాటా అంటూ ధర్మంగా పోరాడుతున్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని ఎస్డీఎల్సీ ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ కాకతీయ యూనివర్సిటీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ, బీసీ విద్యార్థులు ధర్మదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ధర్మదీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధిం చినప్పటి నుండి అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీ కులస్తులకు రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి, అగ్రవర్ణ రాజకీయ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలు గాను, ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలిపోయారన్నారు. దేశంలో అన్ని వర్గాల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే, కేవలం బీసీలకు మాత్రం రిజర్వేషన్లు లేని కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా అణ చివేతకు గురిచేయబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థులు చేస్తున్న ధర్మదీక్షతోనైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లను కల్పించేందుకు ముందుకు రావాలని, లేనియెడల ఉద్యమాన్ని గ్రామస్థాయి నుండి పటిష్టం చేసి, గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట పట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. కేయూ పాలకమండలి సభ్యులు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా. చిర్ర రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంతానికి పోయి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును అడ్డుకొని బీసీలకు అన్యాయం చేయొద్దని, బీసీ రిజర్వేషన్లను కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పేరు వస్తుందని, బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలలోని నాయకులంతా పార్టీల కతీతంగా బీసీ ఉద్యమంలో కలిసి రాకపోతే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కొందరు అగ్రవర్ణ పార్టీలకు తలొగ్గిన నేతలు బీసీ ఉద్యమాన్ని నీరు కార్చేందుకు కుట్రలు చేస్తున్నారని, వారిని ప్రజాక్షేత్రంలో ఎండ గడతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ విద్యార్థులు రిజర్వేషన్లను సాధిం చేందుకు పోరుబాట పట్టారని, వారి పోరాటం ఉగ్రరూపం దాల్చకముందే కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్మదీక్షను తెలుగు డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి మామిడి లింగయ్య నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు బక్కి అవినాష్, ప్రొఫెసర్లు మండ సారంగపాణి, శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాస్, సంఘాని మల్లేశ్వర్, కృష్ణ యాదవ్, సంకినేని వెంకన్న, రమేష్, బీసీ విద్యార్థి నాయకులు సుమన్, అజయ్, గణేష్, రాజశేఖర్, రాజ్ కుమార్, నితిన్, సంజీవ్, రాజేష్, అనిల్, వినోద్, సాయి కృష్ణ, మహేష్, నాగరాజ్ యాదవ్, నాగరాజు పటేల్, చిర్ర సుమన్, వేముల మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మాయమైన అందెశ్రీ

## – మానవతా విలువల కవి



మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మానవత విలువలను నేర్పిన మహోన్నత
కవి
కొమ్మ చెక్కితే బొమ్మ రా
కొలిసి మొక్కితే అమ్మ రా
అంటూ ప్రకృతికి మనిషికి
విడలేని బంధాన్ని చెప్పిన ప్రకృతికవి
బడికెళ్ళి అక్షరాన్ని నేర్చుకోని బాల్యం,
సదువు లేకుండానే
అక్షరాలను అందంగా అమర్చి
లోకానికి అద్భుత సాహిత్యాన్ని
అందించిన ప్రజాకవి
సేలల్లో, సెలకల్లో అతనిపాట
కష్టజీవులకి విశ్రాంతపు బాట
జయ జయహే తెలంగాణ పాట
తెలంగాణ ఉద్యమాల తెగించినా పాట
శ్రమజీవుల కష్ట సుఖాలు
ప్రకృతితో మమేకమైన జీవన గీతాలు
జనంకోసం చేసిన యుద్ధరచనలు
పల్లె కార్మికుల చెమట చుక్కలు
అక్షరాలే లక్షల ఆస్తిగా బతికినోడు
అక్షరాన్ని ఏనాడు తాకట్టుపెట్టనోడు
నిస్వార్థపు, నిజాయితీగల
ప్రకృతి ప్రేమికుడు
అన్యాయం గుండెల్లో మండే సూర్యుడు
బ్రతుకు జీవితం పేదరికమైన
సాహిత్య కవుల్లో అపరకుబేరుడు
మంచిమనుసున్న మహోన్నతుడు
అమరవీరుల ఆత్మబంధువు
అందెశ్రీ అందనంత దూరం
వెళ్ళిపోయావా!
తెలంగాణ అమరవీరుల దరికి చేరావా!!
జోహార్లు అందె శ్రీ
జోహార్లు ప్రజాకవి,ప్రకృతికవి.

**గుంపెల్లి గౌతమ్ రాజ్**
**జర్నలిస్టు**

# అందె శ్రీ మరణం తీరని లోటు

**వేద న్యూస్, చొప్పదండి :**

తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" సృష్టికర్త, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో "జయ జయహే తెలంగాణ" గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచింది. అలాంటి ప్రముఖ కవి, రచయిత అందె శ్రీ మరణవార్త దిగ్భ్రాంతికి గురి చేసింది అని మాల మహానాడు టౌన్ అధ్యక్షుడు సంబోజి సునీల్ సంతాపం తెలిపారు. తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించిన ఆయన గీతాలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజలకు గాని, భారతదేశ ప్రజలకు గాని ఆయన మరణం తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.



**– మాల మహానాడు టౌన్ అధ్యక్షుడు సంబోజి సునీల్**

## ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు
# ఓటర్లు బుద్ధి చెబుతారు

మద్యం, డబ్బు, చీరలు, మిక్సీ గ్రైండర్లు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రభావితం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను ఎన్నికల సంఘానికి సమర్పించామని వెల్లడించారు. అధికార యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటున్న అధికార పార్టీపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఈవో సుదర్శన్‌రెడ్డిని కోరినట్టు తెలిపారు. కొంతమంది పోలీసులు, అధికారులు కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఈ విషయం మీద ఫిర్యాదులు చేసినా, తక్షణ స్పందన కనిపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత కుట్రలు, ప్రలోభాలు పెట్టినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన తీర్పుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఉపఎన్నికలో జరుగుతున్న అసాంఘిక చర్యలు, సున్నితమైన బూత్‌ల వివరాలను ఎన్నికల సంఘానికి అందజేశామని హరీశ్‌రావు తెలిపారు. ఆ బూత్‌ల వద్ద కేంద్ర భద్రతాబలగాలను నియమించాలని కోరారు. నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు తయారీపై సమాచారం, వీడియో ఆధారాలను కూడా ఎన్నికల పరిశీలకులకు అందజేశామని తెలిపారు. మహిళా ఓటర్లకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించారు. ఆరు హామీలపై రెండు సంవత్సరాలుగా సమీక్షలు చేయని ప్రభుత్వం, ఇప్పుడు ఉపఎన్నిక కోసమే సమీక్ష నాటకాలు ఆడుతోందని హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అశాంతిగా ప్రవర్తిస్తున్నారని, ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను ఓడించాలని నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు.

## స్పీకర్ పై సుప్రీంలో
# కోర్టు ధిక్కరణ పిటిషన్

అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని బీఆర్ఎస్ అభ్యర్థించింది. జూలై 31న సుప్రీం కోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి, అక్టోబర్ 31వ తేదీ లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశించిన విషయాన్ని బీఆర్ఎస్ గుర్తుచేసింది. అయితే గడువు పూర్తైనా నిర్ణయం వెలువడకపోవడంతో, ఫిరాయింపు నేతలు ఇంకా ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. అందుచేత మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ వాదిస్తోంది. విచారణ ప్రక్రియ ఆలస్యం చేయడం అనర్హత నిర్ణయానికి వ్యతిరేక ప్రభావం చూపుతుందని, గతంలో సుప్రీం కోర్టు కూడా ఇదే విషయంపై హెచ్చరించినట్టు బీఆర్ఎస్ గుర్తుచేసింది. ఇంకా ప్రొసీడింగ్స్ సాక్ష్య సేకరణ దశలోనే ఉన్నాయని, దీన్ని కావాలనే లాగుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు ఆరోపించారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి పదవీ విరమణ వరకు ఈ ప్రక్రియను కొనసాగించాలని ప్రభుత్వం చూస్తోందని వాదించారు. ఈ వాదనలపై స్పందించిన సుప్రీం కోర్టు, నవంబర్ 24తో సుప్రీం కోర్టు కార్యకలాపాలు ముగిసినట్టుగా భావించడం తప్పు అని స్పష్టం చేసింది. ఈ కేసును వచ్చే సోమవారం విచారణకు తీసుకుంటామని ధర్మాసనం ప్రకటించింది.

# అందెశ్రీ పార్థివదేహానికి కేటీఆర్ నివాళి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి అందెశ్రీ పార్థివ దేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళు లర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పలువురు నేతలు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందెశ్రీ గారి సేవలు, రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భావజాలాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన గొప్ప కవి నష్టపోవడం సమాజానికి, సాహిత్యానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ గారి రచనలు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని, ఆయన మాటల్లో తెలంగాణ ఆత్మ ఉందని కేటీఆర్ భావోద్వేగంగా అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# దేశ రక్షణ స్వావలంబనకు డీపీఎస్‌యూలు శక్తివంతమైన స్తంభాలు : రాజ్‌నాథ్

**వేద న్యూస్ డెస్క్:**



దేశ రక్షణ రంగంలో స్వావలంబనను బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ పెద్ద అడుగు వేసింది. అగ్రశ్రేణి సదుపాయాలతో నిర్మించిన డీపీఎస్‌యూ భవన్ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో ప్రారంభించారు. అనంతరం డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ డీపీఎస్‌యూ పనితీరును సమీక్షిస్తూ సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశీయ రక్షణ ఉత్పత్తి ప్రగతిపై మాట్లాడిన రాజ్‌నాథ్ సింగ్, భారత్ 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో ?1.51 లక్ష కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తిని సాధించిందని తెలిపారు. ఇందులో 71.6% ఉత్పత్తి డీపీఎస్‌యూలు అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మన 16 డీపీఎస్‌యూస్ దేశ రక్షణ స్వావలంబనకు శక్తివంతమైన స్తంభాలుగా నిలుస్తున్నాయి అని పేర్కొన్నారు. దేశీయ రక్షణ తయారీ సామర్థ్యంపై నమ్మకం పెంచడంలో, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక ఆపరేషన్లలో డీపీఎస్‌యూలు చూపిన ప్రతిభ దేశీయ ప్లాట్‌ఫార్మ్‌ల నాణ్యతను రుజువు చేసిందని మంత్రి తెలిపారు. స్వదేశీ రక్షణ తయారీలో నూతన సాంకేతికత, ఆయుధ వ్యవస్థలు, యుద్ధ సామగ్రి అందుబాటును పెంచే విధానంలో డీపీఎస్‌యుల పాత్ర అసాధారణమన్నారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో నిర్మించిన కొత్త డీపీఎస్‌యూ భవన్, రక్షణ సంస్థల మధ్య సమన్వయం, పరిశోధన%-%అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్య అభివృద్ధికి కేంద్ర బిందువుగా పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. డీపీఎస్‌యూ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషిని ప్రశంసించిన రాజ్‌నాథ్, "వారి అంకితభావమే దేశ రక్షణ స్వావలంబన దిశగా మమ్మల్ని ముందుకు తీసుకెళ్తోంది" అన్నారు.

వేద న్యూస్

మంగళవారం నవంబర్ 11, 2025

# ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**వేద న్యూస్, వరంగల్:**

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిడబ్ల్యూ ఓ రాజమణి, లతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల ప్రజలు నుండి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ... ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్క రించాలని, పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారులకు లిఖిత పూర్వకంగా తెలుపుతూ సరైన సూచనలు అందించాలని తెలిపారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించగా, అందులో భూ సమస్యలు 45, గృహ నిర్మాణ శాఖకు 15, కలెక్టరేట్ 15, జిడబ్ల్యూ ఎంసీ 8, పోలీసు శాఖ 6 ఇతర శాఖలకు సంబంధించినవి 76 దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల సందర్శనలో విద్య తో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే, పాఠశాలల్లో శుభ్రత, తాగునీటి సౌకర్యాలు మరియు హాస్టల్ వాతావరణం మెరుగుపర్చే చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడంలో స్ఫూర్తి కార్యక్రమం జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్న నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలు, ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు, సంబంధిత అధికారులు పాల్గొని విద్యార్థుల మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి గణపతి, ఆర్డీఓ ఉమా రాణి, వివిధ జిల్లా స్థాయి అధికారులు, తహ సీల్దార్లు, కలెక్టరేట్ పర్య వేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ

**వేద న్యూస్, వరంగల్:**

నగరం లోని జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ (యాక్షన్ ప్లాన్)సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వీధి కుక్కల నియంత్రణ పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు మేయర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణంగా నగరం లో జన సమూహ ప్రాంతాలైన పాఠశాలలు రైల్వే , బస్ స్టేషన్లు ,ఆసుపత్రులు పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఏ డబ్ల్యూ బి ఐ)వారి సూచనలను పరిగణలోకి తీసుకొని బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ శానిటేషన్ విభాగాలు సమన్వయం తో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఎస్ ఈ సత్యనారాయణ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# రుచి కోసం కాదు.. ఆరోగ్యం కోసం ఆహారం తీసుకోవాలి

## – ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**వేద న్యూస్, నర్సాపూర్ :**

నర్సాపూర్ ఎమ్మెల్యే ప్రతి వ్యక్తి రుచి కోసం కాదు ఆరోగ్యం కోసం అన్ని రకాల ఆహార పదార్థాలు తినాలని, ముఖ్యంగా స్థానికంగా దొరికే ఆకుకూరలని తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి. చిలిపిచెడ్,రుచి కోసం కాదు ఆరోగ్యం కోసం ఆహారం తీసుకోవాలని..అలాగే ఆకుకూరలు, కూరగాయలు తినడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలో మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషీ మాత ఆధ్వర్యంలో పోషణ మాస వార్షికోత్సవాలు, బాల్య వివాహ నిషేధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి రుచి కోసం కాదు ఆరోగ్యం కోసం అన్ని రకాల ఆహార పదార్థాలు తినాలని, ముఖ్యంగా స్థానికంగా దొరికే ఆకుకూరలని తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతీ ఆడపిల్లను చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలని, చదువులు చదివించి వారికి ఉద్యోగాలు వచ్చిన తర్వాత పెళ్లిళ్లు చేస్తే రాబోయే కాలంలో మంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా మండల అంగన్వాడీ టీచర్లు తయారుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌ను అన్నింటిని చూసి అభినందించారు. అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమంలో ఉత్తమ, అంగన్‌వాడీ టీచర్లకు ఆశా , ఏపీఎం,సి ఏ,సీసీ పంచాయతీ కార్యదర్శికి , ఏఎన్ఎం మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్‌వైజర్, పారిశుద్ధ్య కార్మికులకు, ప్రశంస పత్రాలను అందించారు. బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి..ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డీడబ్ల్యూవో హేమ భార్గవి మాటా ్లడుతూ.. బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని, దీనికోసం ప్రతి ఒక్కరి సహాయం సహకారం ఖచ్చితంగా ఉండాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోషిమాత, ఆర్ఐ సునీల్ సింగ్, ఎంపీడీవో ప్రవీణ్ నాయక్, ఏపీఎం గౌరీ శంకర్, వైద్యాధికారి శ్రీకాంత్, ఎస్ఐ నర్సింలు, ఎన్జీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు, సీఏలు, సీసీలు, ఆశాలు, అంగన్వాడి టీచర్లు, ఐసీడీసీ సిబ్బంది, షీ టీమ్, సఖి టీం గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ఆందోళన

## – శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య



**వేద న్యూస్ కడప:**

కడపలోని శ్రీచైతన్య స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని జస్వంతి హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో కలకలం రేపింది. పులివెందులకు చెందిన ఈ విద్యార్థిని మృతి నేపథ్యంలో విద్యార్థుల భద్రత, హాస్టల్ నిర్వహణ, మానసిక ఒత్తిడి అంశాలపై తీవ్ర చర్చ మళ్లీ మొదలైంది. ఈ సంఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించింది. విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆ పార్టీ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా విమర్శలు చేసింది. పాఠశాల, కాలేజీల్లో విద్యార్థులపై ఒత్తిడి పెరిగిపోతున్నా, ప్రభుత్వం సమర్థ వంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించింది. విద్యారంగ సంక్షోభంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖలకు కీలక పాత్రలో ఉన్న నారా లోకేష్ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించింది. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు వరుసగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, పాఠశాల యాజమాన్యాల బాధ్యత, హాస్టల్ పర్యవేక్షణ, కౌన్సెలింగ్ వ్యవస్థల బలోపేతం అవసరమని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. జస్వంతి మృతి పై సెల్ఫ్ కేర్, విద్యార్థి ఒత్తిడి నివారణ, తల్లిదండ్రులు–గురువులు–నిర్వా హకుల పాత్రపై చర్చ మళ్లీ రాజుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హాస్టల్ లోని భద్రత, పర్యవేక్షణ విధానాలపై కూడా విచారణ జరుగుతోంది.


# మాట్రిమోని మోసాలపై జాగ్రత్త..!

**వేద న్యూస్, హైదరాబాద్ :**



వివాహ పరిచయాల పేరుతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలు, వలపులు మరింత పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ప్రజలకు అప్రమత్తం కల్పించారు. మాట్రిమోని వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్, సోషల్ మీడియా వేదికగా నమ్మకాన్ని దోపిడీ చేస్తున్న మోసగాళ్ల గురించి స్పష్టమైన సూచనలు, జాగ్రత్తలు సూచిస్తూ పోలీసులు ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్ పరిచయాల ద్వారా తమను డాక్టర్లు, ఉద్యోగస్తులు, విదేశాల్లో స్థిరపడిన వారిగా చెప్పుకుంటూ మోసగాళ్లు బలహీన భావోద్వేగాలను ఉపయోగించుకొని డబ్బులు వసూలు చేస్తున్న కేసులు పెరుగుతు న్నాయని పోలీసులు హెచ్చరించారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే రాష్ట్రం అనే పేర్లతో నమ్మకం పెంచి అనంతరం అబద్ధపు కథలు చెప్పి డబ్బులు అడగడం, విలువైన వస్తువులు పంపించమని ఒత్తిడి చేయడం వంటి ఘటనలు నమోదవుతున్నాయని తెలిపారు. వధూవర పరిచయాల యాప్‌లలో వ్యక్తిగత వివరాలు పంచే ముందు వినియోగదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ చేసుకోవాలని, వ్యక్తిగత ఫోటోలు, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి సున్నితమైన సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని పోలీసులు సలహా ఇచ్చారు. సందేహాస్పద ప్రొఫైళ్లపై వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయం అయిన వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసే ముందు కుటుంబ సభ్యుల పరిశీలన ఉండాలని, హఠాత్తుగా ప్రేమ, పెళ్లి, విదేశీ పంపిణి వంటి ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. మోసగాళ్లకు అవకాశం ఇవ్వకుండా, మోసపోయిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వేదికగా వేగంగా వ్యాపిస్తున్న ఈ మ్యాట్రిమోని–లవ్ స్కామ్‌లపై ప్రజలు అప్రమత్తత పాటించాల్సిన అవసరం ఉందని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు.

# నిట్స్ అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ



**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

కురుపాం ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నిట్ ఎన్ ఐ టి ఎస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రోత్సాహార్థం యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ సోమవారం ప్రత్యేక అధ్యయన మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ వీ. రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని, సమయపాలనతో కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించగలరని” సూచించారు. షేక్ గౌస్ మాట్లాడుతూ, “గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పించడమే మా సంస్థ లక్ష్యం. విద్య ద్వారా మాత్రమే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ‘పది’ ఫీజులు కట్టిన బండి



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

“మోదీ గిఫ్ట్” పేరుతో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సోమవారం ఎల్కతుర్తి మండల టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని ఈ మేరకు చెల్లించారు. కేంద్ర మంత్రి సంజయ్ ఆదేశాల మేరకు బీజేపీ నేతలు కొలను సంతోష్ రెడ్డి, గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి పరీక్షా ఫీజు మొత్తానికి సంబంధించి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికి ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు సంజయ్ కుమార్ నిర్ణయం తీసుకొని, ఆమేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, . వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పరీక్ష ఫీజుల విషయంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని భరించి , వారికి చేయూతనిచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కి బిజెపి ఎల్కతుర్తి మండల పక్షాన ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఈ సందర్భంగా చెప్పారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# ఏడుగురిని కన్న తల్లికి ఏడుపే దిక్కా?

- మాతృమూర్తి ఆకలి ఆర్తనాదాలు బిడ్డలకు వినిపిస్తలేవో?
- బుక్కెడు బువ్వకు భిక్కుభిక్కుమంటున్న గుండెకారి అంబక్క
- మాయమైపోతున్నారమ్మా..కడుపున పుట్టిన సంతానమూ
- వృద్ధురాలి సంరక్షణ మరిచిన బిడ్డలు..
- ఠాణా మెట్లెక్కిన తల్లి.. న్యాయం చేయాలని వేడుకోలు



**వేద న్యూస్, కమలాపూర్:**

బాగోగులు చూసుకోవాల్సిన కుమారులు పట్టించుకోకపోవడంతో ఆ తల్లి దీనంగా కాలం వెల్లదీస్తున్న దుస్థితి.. ఆ మాతృమూర్తికి ఏడుగురు సంతానం అందులో నలుగురు కుమారులు. పింఛను డబ్బులు తీసుకుని అయినా సరే.. తనకు బుక్కెడు బువ్వ పెట్టాలని తల్లి వేడుకున్నా కొడుకుల్లో ఎవరూ ముందుకు రావకపోవడంతో.. ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు' అని అందెశ్రీ రాసిన మాటలను ఆ తల్లి పుత్రరత్నాలు అక్షరాలా నిజం చేస్తున్నారు. కని పెంచిన తల్లికి తిండి పెట్టకుండా..ఆమెను క్షోభ పెడుతున్నారు.

**అనారోగ్యంతో వంట చేసుకోలేని స్థితి**

వివరాల్లోకెళితే..హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన గుండెకారి అంబక్క అనే వృద్ధురాలి దీనగాథ ఇది. ఆమెకు ఏడుగురు సంతానం. అందులో నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లున్నారు. ఇంతమంది ఉన్నా ఆ తల్లికి బుక్కెడు బువ్వపెట్టేవారే కరువయ్యారు. ఆ తల్లి చిన్న కూతురు తన భర్త చనిపోయిన తర్వాత తన ఇద్దరు పిల్లలను తీసుకొని...పదేండ్ల క్రితం కమలాపూర్‌కి బ్రతుకుతెరువుకు వచ్చారు. అప్పుడు తన తల్లి అంబక్కను కూడా వెంటబెట్టుకుని..ఆనాటి నుంచి బాగోగులు చూసుకుంటూ వచ్చింది. భర్త కోల్పోయిన ఆమెకు తన ఇద్దరు పిల్లల్ని పోషించడం, చదివించుకోవడమే కష్టంగా మారినా.. ఇన్ని రోజులు ఏదో ఒకలా వెళ్లదీసుకొచ్చింది. ఆర్థిక కారణాలరీత్యా ఆమె కూడా బతుకుదెరువు కోసమని హన్మకొండకు వెళ్లింది. దాంతో వృద్ధురాలు అంబక్క ఎలాగోలా కొంతకాలంగా నెట్టుకొస్తున్నది. ఇటీవల కాలంలో ఆమెకు ఆరోగ్యం సహకరించక వంట కూడా చేసుకునే ఓపిక లేక గోస పడుతున్నది. వృద్ధురాలి పరిస్థితిని చూసి చలించిన మహిళా సంఘాల వీవోఏ పుల్ల బుజ్జమ్మ కొద్ది కాలం పాటు తన ఇంట్లో ఆశ్రయం కల్పించింది. కానీ, రోజురోజుకూ ఆ వృద్ధురాలి ఆరోగ్యం ఇబ్బందిగా మారుతుండడంతో ఆమెను చూసుకునే వారే లేకుండా పోయారు. ఈ నేపథ్యంలోనే వృద్ధురాలు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పోలీసులు, అధికారులు తనకు న్యాయం చేయాలని, తన కుమారులను పిలిపించి తనకు బుక్కెడు బువ్వ పెట్టించేలా చూడాలని ఆ వృద్ధురాలు వేడుకుంటున్నారు.

## బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

**వేద న్యూస్ న్యూఢిల్లీ :**



బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి దశలో 121 స్థానాల్లో ఓటింగ్ జరగగా, మిగిలిన 122 స్థానాలకు మంగళవారం రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 1302 మంది అభ్యర్థులు ప్రజాభిప్రాయ పరీక్షకు హాజరవుతున్న దాదాపు నాలుగు కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. రెండో దశలో పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ వంటి జిల్లాల్లో ఓటింగ్ జరగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మొత్తం నాలుగు లక్షల మంది పోలీసు సిబ్బంది, కేంద్ర భద్ర తాబలగాలను నియ మించారు. అవసరమైన సామగ్రితో ఎన్నికల సిబ్బంది ఇప్పటికే సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు. ఈ దశలోనూ నితీశ్ కుమార్ ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, ప్రముఖ నాయకులు తమ అదృష్టాన్ని పరీక్షించు కోను న్నారు. రాష్ట్రంలో ప్రధాన పోటీ మహాగఠ్‌బంధన్, ఎన్డీయే కూటముల మధ్యనే నెలకొంది. దీనితో పాటు కొత్తగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నాయకత్వంలోని జనశక్తి జనతాదళ్ పార్టీలు కూడా బరిలో నిలిచాయి. రెండో దశ ఫలితాల ప్రభావం రాష్ట్ర రాజకీయాల దిశను నిర్ణయించే అవకాశ ముండటంతో అన్ని పార్టీల దృష్టి ఈ దశ పోలింగ్‌పై కేంద్రీకృతమైంది.

# 'ఆకాస' ఎయిర్‌లైన్స్..!





**వేద న్యూస్, డెస్క్:**

ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానాలను ప్రారంభించనున్నది. ఈ మేరకు బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలని ఆశియస్తున్నట్లుగా సీనియర్ ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది. త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఏఈ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది. బోయింగ్ ఉత్పత్తిని పెంచుతున్నందున కంపెనీకి వేగంగా విమానాలు వస్తాయని ఆశిస్తున్నట్లుగా అయ్యర్ తెలిపారు. అనుబంధ ఆదాయ వృద్ధిపై సంతోషంగా ఉన్నామని.. లోడ్ ఫ్యాక్టర్, విమాన ఛార్జీల పరంగా ప్రస్తుతం సమతుల్యత ఉందని ఆయన వివరించారు.

# నింగికేగిన ఆశుకవి

- శోకసంద్రంలో సాహితీ లోకం
- తెలంగాణ భావజాలానికి శబ్దాన్నిచ్చిన ఉద్యమశ్రీ
- అందెశ్రీ అస్తమయం.. తెలంగాణ సాహిత్యానికి తీరని లోటు



**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా, తెలంగాణ సాహిత్యానికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) ఆకస్మిక మరణం తెలుగు భాషా ప్రపంచాన్ని, సాహితీ లోకాన్ని శోకసంద్రంలో ముంచింది. ఇంట్లో అకస్మాత్తుగా కుప్పకూలిన ఆయనను, వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 7:25 గంటలకు ప్రాణాలు విడిచారు. ఉద్యమగీతాల కర్త నిశ్శబ్దంలో కలిసిపోయిన వార్త తెలంగాణ ప్రజలకు తట్టుకోలేని దెబ్బగా మారింది.

**తెలంగాణ స్వప్నాన్ని పదబంధాలుగా మలిచిన వాగ్గేయకారుడు**

1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించిన అందె ఎల్లయ్య, తర్వాత 'అందెశ్రీ'గా సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా చెక్కబడ్డారు. ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతం, కేవలం పాట కాదు..ఒక ఉద్యమానికి ఊపిరి, ఒక జాతికి ఐక్యస్వరపటం. ఆ గీతం తప్పకుండా పాడకుండానే ఉద్యమ సభలు ప్రారంభం కావని చెప్పుకోవడం అతిశయోక్తి కాదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భావోద్వేగాలకు అక్షరరూపం ఇచ్చి, ప్రజల్లో నిప్పులు రాజేసిన అరుదైన కవుల జాబితాలో అందెశ్రీ అగ్రగణ్యుడిగా నిలిచారు.

**పురస్కారాలు**

అందెశ్రీకు ప్రభుత్వం ఇటీవల కోటి రూపాయల పురస్కారం ప్రకటించడం, సాహిత్య రంగం కోసం ఆయన చేసిన సేవలకు ఒక ప్రభుత్వ గౌరవం. కాకతీయ యూనివర్సిటీ నుంచి పొందిన గౌరవ డాక్టరేట్, 2006లో గంగ సినిమాకు అందుకున్న నంది అవార్డు, 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారాలు..ఏ అవార్డును చూసినా, అవన్నీ ఆయన సాహిత్య ప్రస్థానాన్ని మాత్రమే గాక, తెలంగాణ మానసికతను సమగ్రంగా ప్రతిబింబించిన జీవన గాధను కూడా వ్యక్తపరుస్తాయి.

**మనస్సు కవి**

అశువు కవిత్వంలోని పటిమ, సభలలో సుడిగాలిలా కవితలు పొంగిపడే వీరత్వం, రాజకీయ వ్యంగ్యంతో కూడిన ప్రజల హృదయాలను తాకే కవితా శైలి..అందెశ్రీని ప్రత్యేకంగా నిలబెట్టిన లక్షణాలు. కేవలం ఉద్యమ కవి మాత్రమే కాదుబీ సామాజిక విలువలు, తెలుగు సంస్కృతి, ప్రజా భావజాలం, రాజకీయ సంస్కరణలు..అన్ని రంగాల్లోనూ ఆయన కలం సమానంగా రగిలింది. తెలంగాణ ప్రజల నిత్యజీవితాన్ని, వారి మాటతీరు, వారి మట్టిసువాసనను పదాలలో నింపగలిగిన అరుదైన శక్తి ఆయనకు ఉండేది.

**తెలంగాణ కోసం శ్వాసించిన కవి**


తన జీవితాంతం తెలంగాణ కోసం శ్వాసించిన కవి, తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఆత్మపరిశీలన, నిర్మాణం, సంస్కృతి వికాసం కోసం కలంతో కాపలాదారిగా నిలిచాడు. ఇంత గొప్ప ప్రతిభావంతుడైన సాహితీవేత్త ఇలా అకస్మాత్తుగా వెళ్లిపోవడం తెలుగు సాహిత్యానికి తిరుగులేని లోటు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి మాత్రమే కాదు..తెలంగాణ మట్టి, భాష, భావాలకు ఆయన మరణం అంతులేని ఖాళీని మిగిల్చింది.

**అంతిమ శ్రద్ధకు ఒకే మాట– "జయ జయహే అందెశ్రీ"**

అందెశ్రీ వదిలి వెళ్లింది కేవలం గ్రంథాలు కాదు..అనేక తరాలను ప్రేరేపించే ఆలోచనలు, తెలంగాణ భావజాలాన్ని నిలబెట్టే బాణీలు, జాతి గౌరవాన్ని ప్రతిబింబించే అక్షరకిరీటం. ఉద్యమం పుట్టించి, ఊపిరి ఇచ్చి, చివరకు మౌనంలో కలిసిపోయిన ఈ మహాకవికి అమరత్వం ప్రజల నోట మాటగా కాదు. ప్రతి తెలంగాణవాడి రక్తంలో, హృదయధ్వనిలో, "జయ జయహే" స్వరంలో ఉండబోతోంది.

# బహ్రెయిన్‌లోనూ యూపీఐ సేవలు..

**వేద న్యూస్, డెస్క్:**





భారత్–బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయడానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. దాంతో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ తో ముఖ్యంగా ఫారిప్లస్ సేవతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. ఫారీప్లస్ అనేది బహ్రెయిన్‌లో దాదాపు రియల్ టైమ్ బ్యాంక్ టు బ్యాంక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సేవలు అందిస్తుంది. ఇది దేశంలోని ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ లో భాగం. ఈ భాగస్వామ్యం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ మార్గదర్శకత్వంలో జరిగింది. రెండు దేశాల మధ్య క్రాస్–బోర్డర్ చెల్లింపు కనెక్టివిటీని బలోపేతం చేయడంలో ఈ సహకారం ఓ కీలకమైన అడుగుగా పరిగణిస్తున్నారు. ఇది దేశ మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న బహ్రెయిన్‌లో నివసిస్తున్న భారతీయులకు డబ్బు పంపడం, స్వీకరించడాన్ని సులభతరం, సురక్షితంగా చేస్తుందని పేర్కొన్నాయి.

# త్రిషకు బెదిరింపులు

- హీరోయిన్ నివాసంలో బాంబులు అమర్చినట్టు మెయిల్

**వేద న్యూస్, డెస్క్:**



తమిళనాడు రాజధాని చెన్నైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలకు గత కొన్నిరోజులుగా వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రముఖ నటి త్రిష నివాసానికి మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. చెన్నై ఆళ్వార్‌పేట్ లోని త్రిష నివాసంలో బాంబు పెట్టినట్లు డీజీపీ కార్యాలయానికి బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో అది బూటకపు బెదిరింపుగా పోలీసులు తేల్చారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తేనాంపేట పోలీసులు తెలిపారు. కాగా, త్రిష నివాసానికి ఇలా బెదిరింపులు రావడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం.

వేద న్యూస్
మంగళవారం నవంబర్ 11, 2025

# దేశరాజధానిలో భారీ పేలుడు

- ఢిల్లీని కుదిపిన కార్ బ్లాస్ట్
- దద్దరిల్లిన విస్ఫోటనం.. పది మంది మృతి
- రెస్క్యూ ఆపరేషన్‌కు సవాళ్లు
- ఎన్నికల ముందు విధ్వంసం
- వ్యూహాత్మక కుట్ర అనుమానాలు



**వేద న్యూస్, డెస్క్:**

దేశ రాజధాని ఢిల్లీ సోమవారం సాయంత్రం బీభత్సానికి వేదికైంది. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో పార్క్ చేసిన కారులో సంభవించిన శక్తివంతమైన పేలుడుతో పది మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, పలువురు తీవ్రంగా



గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో రాజధాని మొత్తం ఉలిక్కిపడగా, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా ఢిల్లీ, ముంబై, ఉత్తరప్రదేశ్‌లలో హై అలర్ట్ ప్రకటించడంతో ప్రధాన నగరాలు రక్షణ వలయాల్లోకి వెళ్లాయి.

**ఎన్ఐఏ రంగంలోకి**

పేలుడు వార్త వెలువడిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గొల్చా, ఐబీ చీఫ్ తపన్ డేకా, ఎన్ఐఏ డీజీ సదానంద్ వసంత్‌కు ఆదేశాలు జారీ చేసి, ఘటనా స్థలానికి ప్రత్యేక దర్యాప్తు బృందాలను పంపించారు. ఎన్ఐఏ ఇప్పటికే కేసు దర్యాప్తు చేపట్టి పేలుడు స్వరూపం, ఉగ్రవాద కోణాలను విశ్లేషిస్తోంది. స్థానిక పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా సమగ్ర విచారణలో నిమగ్నమయ్యాయి.

**రద్దీ ప్రాంతం ప్రభావం**

ఎర్రకోటేచుట్టుపక్కల ప్రాంతం ఎప్పుడూ జనసంచారం ఎక్కువగా ఉండటంతో రక్షణ చర్యలకు ఆటంకం ఏర్పడింది. అయినప్పటికీ, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తెచ్చాయి. గాయపడిన వారిని సమీప ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సహా పలు కీలక ప్రదేశాల్లో రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేశారు.

**– ఉగ్రదాడి కోణం? ఫరీదాబాద్ ఆపరేషన్‌తో పెరిగిన అనుమానాలు**

సోషల్ మీడియాలో ఈ దాడి వెనుక ఉగ్రవాదుల చేతులున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, అదే రోజు ఉదయం జరిగిన ఒక పెద్ద ఆపరేషన్ దర్యాప్తును మరింత మలుపు తిప్పుతోంది. ఢిల్లీ–ఎన్సీఆర్ సమీపంలోని ఫరీదాబాద్‌లో జమ్మూకశ్మీర్ పోలీసులు చేసిన దాడిలో జైషే మహ్మద్ , అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్‌కు చెందిన ఏడుగురు తీవ్రవాదులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2,900 కిలోల పేలుడు పదార్థాలు, ఏకే–47లు, పిస్టళ్లు, టైమర్లు భారీగా స్వాధీనం కావడం దేశ భద్రతా సంస్థలను కలవరపెడుతోంది.

**వ్యూహాత్మక కుట్ర అనుమానాలు**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశకు ఒక్కరోజు ముందు రాజధానిలో ఇలాంటి పేలుడు జరగడం దేశవ్యాప్తంగా ఆందోళన పరిస్థితులను తీసుకువచ్చింది. కీలక రాజకీయ సమయాల్లో ఉగ్రవాద శక్తులు ఎప్పటికప్పుడు రుగ్మతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తాయన్న భావన మరోసారి బలపడుతోంది. దాడి నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఉగ్రవాద సంబంధాలు, కుట్రలు, దేశాన్ని అస్థిరపరిచే శక్తుల పాత్రపై ముమ్మరంగా పరిశీలిస్తున్నాయి. త్వరలోనే ఘటనపై కేంద్రం కీలక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

# ‘పీఆర్’.. ఓ మాయ

- అందులో పడొద్దు
- చాంపియన్స్ బీ కేర్‌ఫుల్ – సునీల్ గవాస్కర్

**వేద న్యూస్, డెస్క్:**

వరల్డ్ కప్ విజేతగా యావత్ భారతాన్ని సంబురాల్లో ముంచెత్తిన మహిళా క్రికెటర్లపై కానుకలు కురుస్తున్నాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వాలు భారీ నగదు ప్రోత్సాహకాలతో అభినందిస్తుంటే.. మరోవైపు ప్రచారకర్తలుగా మీరే కావాలని పలు కంపెనీలు కోరుతున్నాయి. ప్రపంచకప్ ఛాంపియన్లతో తమ బ్రాండ్ వాల్యూ పెంచుకునేందుకు పలు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లను సునీల్ గవాస్కర్హెచ్చరించాడు. ప్రచారం కోసం పాకులాడే కొన్ని కంపెనీల పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) మాయలో పడొద్దని.. తస్మాత్ జాగ్రత్త అని సన్నీ సూచించాడు.ప్రపంచ కప్ విజయోత్సాహంలో ఉన్న భారత క్రికెటర్లతో ఒప్పందం కోసం పలు బ్రాండ్లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు స్టార్ ప్లేయర్లను సంప్రదించాయి కూడా. పేరుకు పేరు ఆదాయానికి ఆదాయం వచ్చే అవకాశముండడంతో క్రికెటర్లు ఓకే చెప్పడం ఆలస్యం కాకపోవచ్చు. అయితే.. కొన్ని కంపెనీలు అబద్ధపు వాగ్దానాలు చేస్తాయని, ఆశపడి మోసపోవద్దని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని గవాస్కర్ హెచ్చరిస్తున్నాడు. అతడు ఊరికనే భారత క్రికెటర్లకు సూచనలు చేయడం లేదు. 1983లో తొలిసారి విశ్వ విజేతగా నిలిచిన తమకు ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త సుమా అని చెబుతున్నాడు.

**ఏండ్లు గడిచినా సున్నా..**

‘కపిల్ దేవ్ సారథ్యంలో భారత జట్టు 1983 వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. అప్పటి జట్టులోని క్రికెటర్లను మీడియా ఆకాశానికెత్తేసింది. పలు కంపెనీలు కొన్ని హామీలు ఇచ్చాయి. కానీ, చివరకు అవేమీ మా చేతికి అందలేదు. అలాఅనీ మీడియాను తప్పుపట్టను. ఎందుకంటే వాళ్లకు మా ద్వారా మరింత ప్రచారం వచ్చింది. అందుకే చెబుతున్నా మీకు ప్రామిస్ చేసిన కొన్ని అవార్డులు రాలేదని నిరాశ చెందకండి. భారత్‌లోని కంపెనీలు, ప్రకటన సంస్థలు, కొందరు వ్యక్తులు ఉచిత పబ్లిసిటీ కోసం కాచుకొని ఉంటారు. వరల్డ్ కప్ విజేతలను ప్రచారకర్తలుగా నియమించుకుంటామని చెప్పి.. తమ ఉత్పత్తులను అమ్ముకోవాలని చూస్తారు.అంతేకాదు ఛాంపియన్లను అభినందిస్తూ పలు బ్రాండ్‌లు పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెడుతుంటాయి. అలా అనీ వారికి, క్రికెటర్లతో ఏ సంబంధమూ ఉండదు.






పరోక్షంగా తమ కంపెనీ ప్రచారం కోసం సదరు సంస్థలు సిగ్గు లేకుండా అలా చేస్తుంటాయి. కానీ, కొందరు మాట తప్పకుండా అంబాసిడర్‌గా నియమించుకుంటారు. అందుకే.. ప్రకటనల విషయంలో కాస్త ఆచితూచి అడుగేయండి’ అని విశ్వ విజేతలకు గవాస్కర్ కీలక సూచనలు చేశాడు. వరల్డ్ కప్ విజయంతో భారత మహిళా క్రికెటర్ల బ్యాండ్ వాల్యూ రెండింతలు పెరిగింది. సెమీఫైనల్లో అజేయ సెంచరీ బాదిన జెమీమా రోడ్రిగ్స్ బ్రాండ్ వాల్యూ రూ.60 లక్షల నుంచి రూ.1.5 కోట్లకు.. ఫైనల్ స్టార్ షఫాలీ బ్రాండ్ వాల్యూ రూ.1 కోటికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# కొరియన్ సిరీస్‌లో రష్మిక!



**వేద న్యూస్, డెస్క్:**

బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. ఫాలోవర్లతో షేర్ చేసుకుంది.తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.


# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**వేద న్యూస్, డెస్క్:**



దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అత్యధికంగా హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్ భారీ లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,198.20 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 83,197.67 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,754.49 పాయింట్లు పెరిగింది. చివరకు 319.07 పాయింట్లు పెరిగి 83,535.35 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82.05 పాయింట్ల లాభంతో 25,574.35 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 88.71 వద్ద ముగిసింది. దాదాపు 1,787 షేర్లు పుంజుకోగా.. 2,183 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరగ్గా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం తగ్గింది. మీడియా మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐటీ ఇండెక్స్ 1.6 శాతం, ఫార్మా ఇండెక్స్ దాదాపు 1 శాతం, మెటల్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగాయి.నిఫ్టీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, విప్రో లాభాలను ఆర్జించగా.. ట్రెంట్, అపోలో హాస్పిటల్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్, టాటా కన్స్యూమర్ నష్టపోయాయి. యూఎస్ సెనేట్ షట్‌డౌన్‌ను ముగించాలని నిర్ణయించిన తర్వాత సోమవారం యూరప్, ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. ఆదివారం ఆలస్యంగా జరిగిన ఓటింగ్‌లో ఫెడరల్ ప్రభుత్వానికి నిధులు సమకూర్చడానికి రాజీ బిల్లును ఆమోదించే ప్రక్రియను సెనేట్ ప్రారంభించింది. అయితే, డెమొక్రాట్లు అభ్యంతరం వ్యక్తం చేసి ప్రక్రియను ఆలస్యం చేస్తే తుది ఆమోదం చాలా రోజులు పట్టే అవకాశం ఉంది. డిసెంబర్ మధ్య నాటికి గడువు ముగిసే ఆరోగ్య సంరక్షణ పన్ను క్రెడిట్‌ను పొడిగించడంపై సెనేట్ ఓటు వేసే అవకాశం ఉంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న షట్‌డౌన్ ముగిసిపోతుందన్న అంచనాల మధ్య ఎస్‌అండ్‌పీ500 అంచనాను 0.7 శాతం పెంచాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ అంచనా 0.1 శాతం పెరిగింది. జర్మనీ డాక్స్ 1.4 శాతం పెరిగి 23,891.71 చేరగా.. పారిస్ సీఏసీ 40 0.9 శాతం పెరిగి 8,024.23.. బ్రిటన్ ఎఫ్‌టీఎస్ఈ–100 0.5 శాతం పెరిగి 9,729.77కి చేరుకుంది.

# రొమాంటిక్ ‘బైకర్’




**వేద న్యూస్, డెస్క్:**

అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్ ప్రాజెక్టుగా వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం సిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది.మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

# ‘రాజా సాబ్’ అప్‌డేట్ ఆయా!

**వేద న్యూస్, డెస్క్:**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్–కామెడీ “ది రాజా సాబ్” చిత్రం పై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చ సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని . ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. “ది రాజా సాబ్”లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10–14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు.



ఈ క్రమంలో “ది రాజా సాబ్” ను 2026 జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, “ది రాజా సాబ్” ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.